సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

ఆదివారం । 7 । మే । 2023

I



హరిత శోభ

అనంతగిరి: మాలింగవలస–పాతకోట మార్గంలో హరిత శోభ నెలకొంది. పొలాలు ఏపుగా పెరిగి కనువిందు చేస్తున్నాయి.



మన్యంలో కుండపోత

జిల్లా వ్యాప్తంగా రోజూ వర్షం కురుస్తోంది. ఖరీఫ్ సాగుకు ఎంతో అనుకూలమని జిల్లా వ్యవసాయశాఖ తెలిపింది. IIలో



చిత్ర యూనిట్‌కు సత్కారం

మునగపాకలో 'కలియుగ భగవాన్' చిత్ర యూనిట్‌ను కళాకారులు సత్కరించారు. కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. IIలో

న్యూస్‌రీల్

డిప్యూటీ డీఈవో చెల్లయ్యకు సత్కారం



డిప్యూటీ డీఈవో చెల్లయ్యను సత్కరిస్తున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ,డీఈవో సలీంబాషా

సాక్షి,పాడేరు: డిప్యూటీ డీఈవోగా నియమితులైన ముంచంగిపుట్టు ఎంఈవో చెల్లయ్యను శనివారం కలెక్టరేట్ అవరణలో శాలువా కప్పి అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ సత్కరించారు.ఈ కార్యక్రమంలో డీఈవో సలీంబాషా, హుకుంపేట ఎంపీపీ కూడా రాజుబాబు, డీసీడీవో సూర్యకుమారి, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి చెట్టి వినయ్, రాష్ట్ర కార్యదర్శి జర్సింగి సూర్యనారాయణ, సర్పంచ్ సీదరి సాంబ, మాజీ ఎంపీపీ ఉమామహేశ్వరరావు, పాడేరు ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పోస్టుమెట్రిక్ స్కాలర్‌షిప్‌కు దరఖాస్తులు

కొయ్యూరు: టెన్త్‌లో ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులు లోకులగాంధీ పోస్టుమెట్రిక్ స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తు చేసుకోవాలని ట్రస్ట్ చైర్మన్ లోకుల రమేష్ శనివారం తెలిపారు. పాడేరు డివిజన్ 11 మండలాల్లో ఎక్కువ మార్కులు సాధించిన వారు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులన్నారు. పూర్తి వివరాలకు 9491907677, 8106451108 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

పిడుగుపాటుతో మహిళకు తీవ్ర అస్వస్థత

- పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలింపు



పెద్దమ్మిని డోలీలో కొండ దిగువకు తీసుకువస్తున్న సర్పంచ్ లక్ష్మణరావు తదితరులు

సాక్షి,పాడేరు: మండలంలో బడిమెల పంచాయతీ మారుమూల వల్లాయి గిరిశిఖర గ్రామంలో ఓ ఇంటిపై శనివారం మధ్యాహ్నం పిడుగుపడింది. అక్కడే ఉన్న మాదుల పెద్దమ్మి(45) అనే మహిళ అపస్మారక స్థితికి చేరుకుంది. షాక్‌కు గురైన మరో ఐదుగురు కాసేపటికి తేరుకున్నారు. సర్పంచ్ లక్ష్మణరావు తదితరులు తీవ్ర అస్వస్థతకు గురైన పెద్దమ్మిని డోలీలో వల్లాయి నుంచి కొండ దిగువన ఉన్న బడిమెల గ్రామానికి తరలించారు. అక్కడ నుంచి పాడేరు జిల్లా ఆస్పత్రికి హుటాహుటిన వాహనంలో తీసుకువెళ్లి వైద్యసేవలు అందించారు. ఆమె ప్రస్తుతం ఆస్పత్రిలో కోలుకుంటోందని వారు తెలిపారు. ఈ గ్రామానికి మిషన్ కనెక్ట్ పాడేరులో రోడ్డు అభివృద్ధికి ఐటీడీఏ పీవో అభిషేక్, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి చర్యలు తీసుకుంటున్నారు.

పోలీసుల ఆధ్వర్యంలో చలివేంద్రం



జడ్డంగి స్టేషన్ వద్ద చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏఎస్పీ జగదీష్

రాజవొమ్మంగి: మండలంలోని జడ్డంగి పోలీస్ స్టేషన్ వద్ద రంపచోడవరం ఏఎస్పీ జగదీష్ శనివారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. వేసవిలో ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు ప్రధానకూడళ్ల వద్ద చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని ఆయన తెలిపారు. సీఐ బాజిలాల్, ఎస్ఐ షరీఫ్ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం ఏఎస్పీ రాజవొమ్మంగి, జడ్డంగి స్టేషన్లలో రికార్డులు, పరిసరాలు పరిశీలించి రక్షణపరమైన అంశాలపై అధికారులకు సూచనలు ఇచ్చారు.

మన్యం గుండెల్లో పదిలం

మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతిని ఆదివారం జిల్లావ్యాప్తంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆయన పోరాట స్ఫూర్తిని స్మరించుకుంటూ పలు సేవాకార్యక్రమాలు చేపట్టేందుకు యువత, అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు కార్యాచరణ రూపొందించారు. మనసారా నివాళి అర్పించనున్నారు.

- యువతపై చెరగని ముద్ర వేసిన అల్లూరి
- ఆయన స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు
- అల్లూరి జిల్లా ఏర్పాటుతో మరింత ప్రాధాన్యం
- నేడు వర్ధంతి నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి



అల్లూరిని పట్టుకుంటే రూ.పదివేలు ఇస్తామని నాడు విశాఖ గెజిట్‌లో బ్రిటిష్ వారి ప్రకటన



మంపలో అల్లూరి విగ్రహం

కొయ్యూరు : విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు పోరాటం కలకాలం మన్యం గుండెల్లో స్ఫూర్తిగా నిలిచిపోతుంది. ఆయన పోరాట స్ఫూర్తిని స్మరించుకుంటూ గత 25 ఏళ్లుగా అల్లూరి జయంతి, వర్ధంతులను అల్లూరి యువజన సంఘం పేరిట నిర్వహించేవారు. కొయ్యూరు మాజీ ఎంపీపీ దివంగత బడుగు రామరాజ్యం ఆధ్వర్యంలో వీటిని మంప, రాజేంద్రపాలెంలో నిర్వహించేవారు. ఇప్పుడు యువత అదే స్ఫూర్తితో సేవా కార్యక్రమాలను చేపడుతోంది. అల్లూరి యూత్ పేరిట అనేక కార్యక్రమాలు నిర్వహిస్తోంది. అల్లూరి యూత్ వర్ధంతి పురస్కరించుకుని మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసింది. అల్లూరి గిరిజన యువసేవా సంఘం పేరిట గడబపాలెం పంచాయతీ మల్లవరానికి చెందిన మల్లేష్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు.

మండే సూరీడు.. అల్లూరి

ఆయన మండే సూరీడు. బ్రిటీష్ పాలకుల గుండెల్లో మంటలు రేపాడు. ఏకంగా కైవర్ట్,విలియం లాంటి బ్రిటిష్ సైనిక యోధులను దామనాపల్లి ఘాట్ వద్ద హతమార్చాడు.1922 ఆగస్టులో చింతపల్లి,కృష్ణదేవిపేట, రాజవొమ్మంగి, అడ్డతీగల పోలీసుస్టేషన్లపై దాడులు చేసి బ్రిటిష్ పాలకులకు కునుకు లేకుండా చేశాడు. చివరకు మంపలో అల్లూరి స్నానం చేస్తుండగా పట్టుకున్న బ్రిటిష్ సైనికులు రాజేంద్రపాలెంలో హతమార్చారు. బ్రిటిష్ పాలకుల నుంచి విముక్తికి ఆయన పోరాటం నేటి యువతకు స్ఫూర్తిదాయకం.

రూ.125 నాణెం విడుదల చేయాలి

మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జన్మించి 125 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆయన పేరిట రూ.125 నాణేన్ని విడుదల చేయాలని ఇది వరకు ప్రధాని మోదీ భీమవరం వచ్చినప్పుడు వినతిపత్రం ఇచ్చాం.ఆయన కూడా సానుకూలంగా స్పందించారు.ఇంత వరకు నాణేన్ని విడుదల చేయలేదు. ఇప్పటికైనా నాణేన్ని విడుదల చేయాలి.

– పడాల వీరభద్రరావు, వ్యవస్థాపక అధ్యక్షుడు, జాతీయ అల్లూరి యువజన సంఘం

పర్యాటకంగా అభివృద్ధికి నివేదిస్తాం



అల్లూరి సాయుధ పోరాటానికి సాక్ష్యంగా నిలిచిన మంప, రాజేంద్రపాలెం పార్కులను పర్యాటకంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది. దీనిపై ప్రభుత్వానికి నివేదిస్తాం. పార్కులు ప్రజల ఆదరణ పొందేలా అభివృద్ధి చేస్తాం. నేటి యువత అల్లూరి ఆశయ సాధనకు కృషి చేయాల్సిన అవసరం ఉంది. ఆయన స్ఫూర్తి మార్గదర్శకం.

– అభిషేక్, ఐటీడీఏ పీవో, పాడేరు

అల్లూరి జిల్లా ఏర్పాటుతో సముచిత స్థానం

మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజుకు రాష్ట్ర ప్రభుత్వం సుముచిత స్థానం కల్పించింది. బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా సాయుధ పోరాటం చేసి అమరుడైన అల్లూరి పేరిట జిల్లాను ఏర్పాటు చేయాలని ఎప్పటి నుంచో ఉన్న డిమాండ్‌ను రాష్ట్ర ప్రభుత్వం గతేడాది సాకారం చేసింది. 22 గిరిజన మండలాలతో అల్లూరి నడయాడిన ప్రాంతాన్ని కలుపుతూ అల్లూరి సీతారామరాజు జిల్లాగా ఏర్పాటు చేసి గిరిజనుల చిరకాల కోరికను నెరవేర్చింది. అలాగే రెండున్నరేళ్ల నుంచి అల్లూరి వర్ధంతి, జయంతి కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తోంది. అల్లూరి పార్కులను పూర్తిస్థాయిలో అభివృద్ధికి చర్యలు చేపట్టింది.

కలెక్టర్ దృష్టికి అరకు సమస్యలు

- తాగునీటి ప్రాజెక్టుల ఏర్పాటుకు 50 శాతం నిధులు సిద్ధం
- మిగతావి ఐటీడీఏ సమకూర్చేలా చర్యలు
- విన్నవించిన ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



కలెక్టర్ సుమిత్‌కుమార్‌తో అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, హుకుంపేట ఎంపీపీ, జెడ్పీటీసీ, వైఎస్సార్ సీపీ నేతలు తదితరులు

సాక్షి,పాడేరు: అరకు నియోజకవర్గంలో రూ.10కోట్లతో తాగునీటి పథకాలకు ప్రణాళికలు రూపొందించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను శనివారం ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ కోరారు. కలెక్టర్‌ను శనివారం ఆయన కలిశారు. తన కుమారుని స్నేహితులు యూఎస్ఏలో ఉన్నారని, వారు రూ.5కోట్ల వరకు తాగునీటి పనులకు నిధులు సమకూర్చేందుకు నిర్ణయం తీసుకున్నారన్నారని ఎమ్మెల్యే వివరించారు. మిగిలిన రూ.5కోట్లు పాడేరు ఐటీడీఏ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు.

అటవీశాఖ అనుమతిపై సానుకూల స్పందన

నియోజకవర్గంలోని వంకరాయి, సంకుపర్తి, ఇంజరి, కోంద్రు, సీకరి రోడ్ల అభివృద్ధికి అటవీశాఖ అడ్డంకులు తొలగించాలని కలెక్టర్‌ను ఎమ్మెల్యే పాల్గుణ కోరారు. స్పందించిన కలెక్టర్ ఎమ్మెల్యే సమక్షంలోనే అటవీశాఖ ఉన్నతాధికారితో ఫోన్లో మాట్లాడారు. ఆయా రోడ్ల అనుమతులకు సానుకూలంగా స్పందన లభించినట్టు ఎమ్మెల్యే తెలిపారు. పెదబయలు మండలంలోని మారుమూల పిట్టలబొర్ర జలపాతాన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసి, పక్కా రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరారు. అంతేకాకుండా కించుమండ సమీపంలోని గెడ్డపై వంతెన నిర్మాణాలకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఏజెన్సీలో గిరిజన రైతులు ఎంతో కష్టపడి సాగు చేస్తున్న పసుపునకు గిట్టుబాటు ధరలేదని, కిలో రూ.45కు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లినట్టు ఎమ్మెల్యే తెలిపారు.

మైనింగ్‌పై చర్యలు తీసుకోవాలి

రాష్ట్ర ప్రభుత్వం ఏజెన్సీలో ఎక్కడ మైనింగ్‌కు అనుమతులు ఇవ్వలేదని, మైనింగ్ అక్రమ తవ్వకాలు ఉంటే ఉక్కుపాదం మోపాలని కలెక్టర్‌ను కోరామని ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ తెలిపారు. మైనింగ్ తవ్వకాలకు వచ్చే దరఖాస్తులను కూడా తిరస్కరించాలని, తనతో పాటు గిరిజనులమంతా మైనింగ్‌కు వ్యతిరేకంగా ఉన్నామని ఆయన పేర్కొన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో హుకుంపేట జెడ్పీటీసీ రేగం మత్స్యలింగం, ఎంపీపీ కూడా రాజుబాబు, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి చెట్టి వినయ్, రాష్ట్ర కార్యదర్శి జర్సింగి సూర్యనారాయణ, మాజీ ఎంపీపీ, వైస్ ఎంపీపీలు ఉమామహేశ్వరరావు, వంతాల అప్పారావు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

సాక్షి, పాడేరు: ఐసీడీఎస్ పాడేరు డివిజన్‌లోని మూడు అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి కలెక్టర్ సుమిత్ కుమార్ శనివారం నోటిఫికేషన్ జారీ చేశారు. అరకు ప్రాజెక్టు పరిధిలో 1–ఆయా పోస్టు, ముంచంగిపుట్టు పరిధిలో–1 ఆయా, మినీ అంగన్‌వాడీ కార్యకర్త పోస్టుల ఖాళీల భర్తీకి చర్యలు చేపట్టారు. ఖాళీ పోస్టుల వివరాలు, దరఖాస్తుల ప్రక్రియ, నియమ నిబంధనలు, అర్హత తదితర వివరాల కోసం ఆయా ప్రాజెక్టు కార్యాలయాలను సందర్శించాలని, దరఖాస్తులు ఈనెల 8 నుంచి 15వతేది సాయంత్రం ఐదు గంటల వరకు స్వీకరిస్తామని ఉత్తర్వులో కలెక్టర్ పేర్కొన్నారు.

అంతంతమాత్రంగా టెన్త్ ఉత్తీర్ణత

- పరీక్ష రాసిన విద్యార్థులు 10,878
- ఉత్తీర్ణులు 6,680
- 61.50 శాతం ఉత్తీర్ణత నమోదు
- జిల్లా స్థాయిలో జాహ్నవి శ్రీనిధి ప్రతిభ

సాక్షి, పాడేరు: ఈ ఏడాది టెన్త్ ఉత్తీర్ణతశాతం అంతంతమాత్రంగానే నమోదైంది. జిల్లాలోని 22 మండలాల్లో 63 కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షలకు అన్ని యాజమాన్య పాఠశాలలకు సంబంధించి 10,878 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో 6680 మంది ఉత్తీర్ణులయ్యారు. వీరిలో బాలికలు 3,593, బాలురు 3,087 మంది ఉన్నారు. జిల్లా మొత్తంమీద 61.50 ఉత్తీర్ణత శాతం నమోదైందని జిల్లా విద్యాశాఖ తెలిపింది. గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో ఫలితాలు కాస్త మెరుగ్గా ఉన్నాయి. జిల్లాలోని కూనవరం జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన జాహ్నవి శ్రీనిధి , చింతూరు పరిధిలోని మోతుగూడెం డీపీవీ పాఠశాలకు చెందిన షిండే వేదాక్షయ,దేవీపట్నం మండలం ఇందుకూరుపేట జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన వడ్లపాటి ఉదయ్‌కుమార్,చింతపల్లిలోని సెయింట్ ఆన్స్ ఇంగ్లీషు మీడియం పాఠశాలకు చెందిన దేపూరు శ్రీదుర్గ, చింతూరులోని మోతుగూడెం డీపీవీ పాఠశాలకు చెందిన వానపల్లి సాయికిరణ్, పాంగి భవనశ్రీ అత్యధిక మార్కులు సాధించారు.



జాహ్నవి శ్రీనిధి

- జిల్లాలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలకు సంబంధించి 6983 మంది పరీక్షలు రాయగా, 4,118 మంది ఉత్తీర్ణులయ్యారు.
- కేజీబీవీ పాఠశాలలకు సంభందించి 665మందికి గాను 353మంది ఉత్తీర్ణులయ్యారు.
- గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాలకు సంబంధించి 1198 మంది పరీక్ష రాయగా 952మంది పాసయ్యారు.
- జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో 1134 మందికి 700మంది.ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలలకు సంబంధించి 400 మందికి 346మంది ఉత్తీర్ణులయ్యారని అధికారవర్గాలు తెలిపాయి.

పలువురి అభినందన

కూనవరం : స్థానిక ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని జాహ్నవి శ్రీనిధిని పలువురు అభినందించారు. మండలంలో 354 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 197 మంది పాసయ్యారని ఎంఈవో బాలరాజు తెలిపారు. మండలంలో 56 శాతం ఉత్తీర్ణత నమోదైందని ఆయన పేర్కొన్నారు.

కొయ్యూరు మండలంలో 99.8 శాతం

కొయ్యూరు: మండలంలో 99.8 ఉత్తీర్ణత శాతం నమోదైంది. మొత్తం 12 పాఠశాలల నుంచి 554 మంది పరీక్షలు రాయగా, ఇద్దరు మాత్రమే ఫెయిల్ అయ్యారు. ద్వితీయ శ్రేణిలో 15 మంది, తృతీయ శ్రేణి ముగ్గురు సాధించారు. మంచి మార్కులు సాధించిన కొయ్యూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన వి.బాల పద్మజను హెచ్‌ఎం రామారావు అభినందించారు. గురుకుల పాఠశాలల విద్యార్థులు 17 మంది 500 మార్కులకు పైగా సాధించారు. మండలంలో 99.8 మేర ఉత్తీర్ణత శాతం నమోదైంది.

మోదమ్మ ఉత్సవాల్లో అన్నదానం

- మూడు రోజుల ఏర్పాటుకు నిర్ణయం
- పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి దంపతులు రూ.50 వేల విరాళం

సాక్షి,పాడేరు: జిల్లా కేంద్రం పాడేరులో ఈనెల 14వతేదీ నుంచి 16వతేదీ వరకు నిర్వహించనున్న పాడేరు మోదకొండమ్మతల్లి ఉత్సవాలతో మూడు రోజుల పాటు భక్తులకు ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు మధ్యాహ్నం, రాత్రివేళల్లో ఉచిత భోజన కార్యక్రమాల ఏర్పాటుకు ఆలయ కమిటీ అధ్యక్షురాలు, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ తమర్భ నరసింగరావు రూ.50 వేల విరాళం అందించారు. అన్ని వర్గాల భక్తులు, అధికారులు, ఉద్యోగ, ఉపాధ్యాయులు, వర్తకులు కూడా సహకారం అందిస్తున్నారు. మోద కిరణ్ మణికంఠ అన్నదాన ట్రస్ట్ అమ్మవారి జాతరలో అన్నదాన కార్యక్రమం నిర్వహించనుంది. ఇందుకు సంబంధించి ప్రచార కరపత్రాలను శనివారం సాయంత్రం అమ్మవారి ఆలయంలో ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ తమర్భ నర్సింగరావు, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుళ్లి సింహాచలంనాయుడు, ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షుడు కొట్టగుళ్లి సుబ్బారావు, అర్చకుడు సుబ్రహ్మణ్యం ఉత్సవ, ఆలయ కమిటీ ప్రతినిధులు ఆవిష్కరించారు. ట్రస్ట్ చైర్మన్ శివరాత్రి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి బొడ్డు ముకుందరావు,కోశాధికారి సిద్దనాతి కొండలరావు, కార్యదర్శులు కారం దేముడు, ఆర్‌కే రాజు పాల్గొన్నారు.



అన్నదాన ప్రచార కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఆలయ ప్రతినిధులు

గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి

నాతవరం: ఉపాధి పనులు చేస్తుండగా గుండె పోటుతో ఓ కూలీ మృతి చెందాడు. మండలంలో మర్రిపాలెం గ్రామానికి చెందిన బొత్సా సత్తిబాబు(49) శనివారం తోటి కూలీలతో కలిసి ఉపాధి హామీ పనికి వెళ్లాడు. పనిచేస్తుండగా ఛాతీలో నొప్పి వస్తోందంటూ సత్తిబాబు కుప్పకూలిపోయాడు. తోటి కూలీలు సపర్యలు చేసి వైద్యం కోసం ఇంటికి తీసుకువచ్చారు. స్థానికంగా ఉన్న వైద్యులు పరీక్షించి, అప్పటికే మృతిచెందినట్టు నిర్ధారించారని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈవిషయాన్ని వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యుడు మంకు సాంబమూర్తి ఎంపీడీవో యాదగిరీశ్వరరావు, ఉపాధి హామీ పథకం ఏపీవో చిన్నారావు, వీఆర్వో అప్పారావుకు సమాచారం అందజేశారు. సత్తిబాబు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు భోరున విలపించారు.

అట్రాసిటీ కేసుపై విచారణ

నర్సీపట్నం:మున్సిపాలిటీ పరిధి బలిఘట్టంలో నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై శనివారం డీఎస్పీ కె.ప్రవీణ్‌కుమార్ విచారణ జరిపారు. కొట్లాట ఘటనలో బాధితులను డీ ఎస్పీ క్షుణ్ణంగా విచారించారు. ముందుగా దాడిలో గాయపడిన దనియా మహేష్‌ను విచారించారు.మరో నలుగురిని విచారించి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. దళిత యువకుడిని అకారణంగా కొట్టి చంపేందుకు ప్రయత్నించిన వారిపై చర్యలు తీసుకుని, దాడులు పునరావృతం కాకుండా చూడాలని దళిత సంఘాల నాయకులు ఈశ్వరరావు, నాగేశ్వరరావు, చైతన్యలు డీఎస్పీని కోరారు. సీఐ గణేష్, ఎస్ఐ గోవిందరావు ఉన్నారు.

మన్యంలో కుండపోత

కొనసాగుతున్న వర్షాలు

సాక్షి,పాడేరు: జిల్లా వ్యాప్తంగా రోజూ వర్షం కురుస్తోంది. రానున్న ఖరీఫ్ వ్యవసాయానికి ఈరోజు వారి వర్షాలు ఎంతో అనుకూలమని జిల్లా వ్యవసాయశాఖ తెలిపింది. వేసవి దుక్కులు మన్యంలో హుషారుగా జరుగుతున్నాయి.మెట్ట, కొండపోడులో చిరుధాన్యాలు, పలు వాణిజ్య పంటల విత్తులు కూడా జోరందుకున్నాయి. శనివారం ఉదయం నుంచి వాతావరణం చల్లగానే ఉంది. మధ్యాహ్నం నుంచి వాతావరణం ఒక్కసారిగా మేఘావృతమైంది.సాయంత్రం నాలుగు గంటల నుంచి భారీ వర్షం కురిసింది. జిల్లా కేంద్రమైన పాడేరులో సుమారు గంట పాటు కురిసిన భారీ వర్షానికి జనజీవనానికి అంతరాయం ఏర్పడింది. వర్షాలతో ఖరీఫ్ పంట భూములు తడిచి ముద్దయ్యాయి. లోతట్టు ప్రాంతాలు చెరువులను తలపిస్తున్నాయి. ప్రధాన గెడ్డలు, వాగులలో వరదనీరు చేరుతోంది. అలాగే రబీలో సాగవుతున్న వరి,ఇతర కూరగాయల పంటలకు వర్షాలు ఉపయోగకరమని రైతులు తెలిపారు.

రంపచోడవరంలో అత్యధికంగా..

జిల్లాలో రంపచోడవరంలో అత్యధికంగా 42.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. చింతపల్లిలో 28.2, జి.మాడుగులలో 27.8, అనంతగిరిలో 20.4, పెదబయలులో 18.6, అరకులోయలో 15.2, పాడేరులో 13.6, జి.కే.వీధిలో 9.4, వై.రామవరంలో 8.4, అడ్డతీగలలో 6.6, గంగవరంలో 7.4 మారేడుమిల్లిలో 2.4 ఎంఎం చొప్పున వర్షపాతం నమోదైంది.

జి.మాడుగుల: మండలంలో శనివారం ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. పాడేరు–జి.మాడుగుల, చింతపల్లి, నుర్మతి, వంజరి, గెమ్మెలి, నుర్మతి, సొలభం, గడుతూరు రోడ్డు మార్గాల్లో ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. మండల కేంద్రంలోని చెరువు నీరు మెయిన్‌రోడ్డుపైనుంచి ప్రవహించింది. జి.మాడుగుల తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

హుకుంపేట: మండలకేంద్రంతోపాటు అడ్డుమండ, గూడ, కొట్నాపల్లి, తడిగిరి, తీగలవలస, మఠం తదితర ప్రాంతాల్లో శనివారం భారీ ఈదురుగాలులతో వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. మండల కేంద్రంలో వారపు సంతకు వచ్చిన వ్యాపారులు, గిరిజనులు ఇబ్బందులు పడ్డారు.



పాడేరు కాంప్లెక్స్ రోడ్డులో కురుస్తున్న వర్షం

చిత్ర యూనిట్‌కు సత్కారం

మునగపాక: సమాజానికి మేలు చేకూర్చే సందేశాత్మక చిత్రాలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు వర్తమాన దర్శకుడు కోరుకొండ గోపీకృష్ణ తెలిపారు. ఆయన దర్శకత్వం వహించిన 'కలియుగ భగవాన్' చిత్ర యూనిట్ శనివారం రాత్రి మునగపాక వచ్చింది. దర్శకుడు గోపీకృష్ణతో పాటు మాటల రచయిత విల్లూరి జగ్గప్పారావు, నటుడు వెలవలపల్లి కోటేశ్వరశర్మను స్థానిక కళాకారులు సత్కరించారు. కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రసాద్, విజయ్, జగన్, కేపీరావు, కుమార్, సత్యనారాయణ పాల్గొన్నారు.

బిందు సేద్యం విస్తరణ లక్ష్యం 1200 హెక్టార్లు

- 1,175 హెక్టార్లకు రైతులు రిజిస్ట్రేషన్
- 15 నుంచి దరఖాస్తుల పరిశీలన
- అనకాపల్లి జిల్లా సూక్ష్మ సాగు నీటి ప్రాజెక్టు డైరెక్టరు లక్ష్మి

నాతవరం: సూక్ష్మ నీటి పథకంలో జిల్లాలో ఈఏడాది 1200 హెక్టార్లలో బిందు, తుంపర సేద్యం విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని అనకాపల్లి జిల్లా సూక్ష్మ సాగు నీటి ప్రాజెక్టు డైరెక్టర్ జి.వి.లక్ష్మి తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో శనివారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో మాట్లాడారు. గత ఏడాది 600 హెక్టార్ల లక్ష్యానికి గాను అదనంగా 832 హెక్టార్లలో డ్రిప్ స్పింకర్లు ఏర్పాటు చేశామన్నారు. ఈఏడాది ఇంతవరకు 1,176 హెక్టార్లలో డ్రిప్ స్పింకర్ల ఏర్పాటుకు రైతులు రిజిస్ట్రేషన్ చేసుకున్నట్టు చెప్పారు. రైతుల దరఖాస్తులను ఈనెల 15 నుంచి పరిశీలిస్తామని తెలిపారు. స్పింకర్ల ఏర్పాటు కోసం జిల్లాలో నాలుగు కంపెనీలను ప్రభుత్వం ఎంపిక చేసినట్టు చెప్పారు. వాటిలో రైతులు కోరుకున్న కంపెనీ ద్వారా పరికరాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో లోకుల యాదగిరీశ్వరరావు హౌసింగ్ జేఈ జోగారావు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న అనకాపల్లి జిల్లా సూక్ష్మ సాగు నీటి ప్రాజెక్టు డైరెక్టర్ లక్ష్మి

జెడ్పీలో 88 మందికి కారుణ్య నియామకాలు

- జిల్లాలో రూ.35 కోట్లతో తాగునీటి ఎద్దడి నివారణ పనులు
- 15వ ఆర్థిక సంఘం నిధులతో పలు అభివృద్ధి పనులు
- జెడ్పీటీసీ సభ్యులకు రూ.26 లక్షల వంతున మంజూరు
- జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జి.సుభద్ర

నాతవరం: జిల్లా పరిషత్‌లో 88 మందిని కారుణ్య నియామకాల ద్వారా నియమించామని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జి.సుభద్ర చెప్పారు. నాతవరం మండలానికి మొదటిసారిగా వచ్చిన చైర్‌పర్సన్‌కు ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి శనివారం ఘన స్వాగతం పలికారు. ఎంపీడీవో కార్యాలయంలో నాయకులతో సమావేశమై పలు అంశాల గురించి ఆమె చర్చించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో పూర్తిగా నిర్లక్ష్యం చేసిన కారుణ్య నియామకాలను యుద్ధప్రతిపదికన పూర్తి చేసి ఆయా కుటుంబాలను ఆదుకున్నామన్నారు. ఉమ్మడి జిల్లాలో వేసవిలో తాగునీటి ఎద్దడి ఉన్న గ్రామాల్లో రూ.35 కోట్లతో పనులు చేస్తున్నామన్నారు. ఈ ఏడాది 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.17 కోట్లతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. జిల్లాలో దివ్యాంగులకు కావలసిన ఉపకరణాలకు రూ.5 లక్షలు సమకూర్చుతున్నామని, హైస్కూళ్లలో విద్యార్థులకు అవసరమైన క్రీడా సామగ్రిని రూ.5 లక్షలతో ఏర్పాటు చేస్తున్నామన్నారు. అభివృద్ధి పనుల నిర్వహణకు జెడ్పీటీసీ సభ్యులకు రూ.26 లక్షల చొప్పున నిధులు ఇచ్చామన్నారు.



జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్రకు స్వాగతం పలుకుతున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

జెడ్పీటీసీ అప్పలనర్స కుటుంబానికి వైఎస్సార్‌సీపీ అండ

ఇటీవల అనారోగ్యంతో మరణించిన జెడ్పీటీసీ సభ్యురాలు కాపారపు అప్పలనర్స భర్త వెంకటరమణకు చైర్‌పర్సన్ శ్రద్ధాంజలి ఘటించారు. అప్పలనర్సను పరామర్శించి, పార్టీ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. జెడ్పీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు దొండా రాంబాబు ఆధ్వర్యంలో సమకూర్చిన లక్ష రూపాయలను, పంచాయతీరాజ్ శాఖ జిల్లా ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎస్.సత్యనారాయణ అందించిన రూ.5 వేలను ఆమె అప్పలనర్సకు అందజేశారు. గొలుగొండ, కొయ్యూరు, రావికమతం, చింతపల్లి మండలాల జెడ్పీటీసీ సభ్యులు సుర్ల వెంకట గిరిబాబు, వారా నూకరాజు, తలారి రమణమ్మ, పోతురాజు బాలయ్యపడాల్, నాతవరం ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, ఎంపీడీవో లోకుల యాదగిరీశ్వరరావు, స్థానిక సర్పంచ్ గొలగాని రాణి, వైఎస్సార్‌సీపీ మండల శాఖ అధ్యక్షుడు పైల పోతురాజు, వ్యవసాయ సలహా మండలి మండల చైర్‌పర్సన్ శెట్టి నూకరాజు పాల్గొన్నారు.

ఆర్‌వీఎన్‌ఎల్ ఉద్యోగులకు ప్రతిభ అవార్డులు

దాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ): కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖకు అనుబంధంగా ఉన్న నవరత్న కంపెనీ రైల్ వికాస్ నిగమ్ ఉద్యోగులకు బెస్ట్ పెర్ఫార్మెన్స్ అవార్డులను శనివారం ప్రదానం చేశారు. డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రం వేదికగా నిర్వహించిన వేడుకలో ఆర్‌వీఎన్‌ఎల్ చీఫ్ ప్రాజెక్టు మేనేజర్ వి. రామునాయుడు, ఎస్ అండ్ టీ జనరల్ మేనేజర్ శ్రీనివాసులు, ఎలక్ట్రికల్ జనరల్ మేనేజర్ సుక్ దయాల్ శర్మ చేతుల మీదుగా అవార్డులు, ప్రోత్సాహక నగదు అందజేశారు. ఈ సందర్భంగా రామునాయుడు మాట్లాడుతూ గతేడాది సంబల్‌పూర్–టిట్లాగర్, విజయనగరం–టిట్లాగర్ 82 కిలోమీటర్ల డబ్లింగ్, ట్రిపులింగ్ కమిషనింగ్ పూర్తి కావడం అభినందనీయమన్నారు. ఈ రూట్‌లో డబ్లింగ్, ట్రిపులింగ్ లైన్లు రావడం వల్ల ప్రయాణ సమయం తగ్గిందన్నారు. దీంతో పాటు కొత్త ప్లాట్‌ఫాం, న్యూ స్టేషన్ బిల్డింగ్స్, కొత్త వెయిటింగ్ హాల్స్, ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు వంటి అన్ని సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయని, దీనివల్ల ప్రయాణికులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఇంజినీర్లు, ఉద్యోగులను ఆయన అభినందించారు. ఇకపై ప్రతి ఏడాది బెస్ట్ పెర్ఫార్మెన్స్ అవార్డులు అందజేయనున్నట్టు వెల్లడించారు.



అవార్డులతో ఉద్యోగులు